తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 05- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 31 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చా



- మిడ్జిల్ అభివృద్ధికి కొత్త దిశ.. సీఎం హామీ
- 20 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- వెనుకబడిన మిడ్జిల్‌ను వెలుగుల మండలంగా మారుస్తాం

**మహబూబ్‌నగర్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):**
గడిచిన 20 ఏళ్ల ప్రజా జీవితంలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో తన 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కృతజ్ఞత సభలో పాల్గొన్న సీఎం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సభలో సీఎం మాట్లాడుతూ ప్రతిపక్షంలో

మిగతా 2లో

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పట్టణ గృహ నిర్మాణానికి ప్రాధాన్యం
- శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణం
- సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పట్టణ ప్రాంతాల గృహ నిర్మాణ పథకం, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల శాశ్వత భవనాల నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో

మిగతా 2లో





# రోశయ్యకు ఘన నివాళులు

- 93వ జయంతి వేడుకలు
- గరికపాటికి ఘన సన్మానం
- విలువల రాజకీయాలకు ప్రశంసలు

**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావును రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఘనంగా సన్మానించారు. అనంతరం కేఎస్ఆర్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు అర్పించారు.

మిగతా 2లో

# మరమ్మతులు పూర్తయ్యాకే కాళేశ్వరం బ్యారేజీల నిర్వహణ: మంత్రి ఉత్తమ్

- ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అనుమతే కీలకం
- ప్రజల భద్రతకే తొలి ప్రాధాన్యం
- రూ.1.1 లక్షల కోట్ల పెట్టుబడికి రక్షణ



**నాగార్జునసాగర్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):**
కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తయ్యాకే వాటిని తిరిగి నిర్వహిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) స్వతంత్రంగా పరిశీలించి అనుమతి ఇచ్చిన తర్వాతే బ్యారేజీలను వినియోగంలోకి తీసుకువస్తామని వెల్లడించారు.
నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్‌లో సీనియర్ ఇంజినీర్లతో సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ప్రజల భద్రత, ప్రాజెక్టుల స్థిరత్వం, ప్రజాధన పరిరక్షణకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల ప్రాణాలే ముఖ్యమని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.1 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు చేసిన నేపథ్యంలో ప్రతి రూపాయిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన అన్ని సాంకేతిక లోపాలను సరిదిద్దిన తర్వాతే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.
మరమ్మతులు పూర్తికాకముందే బ్యారేజీలను నిర్వహిస్తే తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా భద్రాచలం పట్టణంతో పాటు దిగువ ప్రాంతాల్లోని సుమారు 40 గ్రామాల ప్రజల భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మిగతా 2లో

# ఆహార భద్రతపై సీఎస్ సమీక్ష

- కల్తీ ఆహారంపై కఠిన చర్యలు
- సమన్వయానికి ప్రత్యేక ప్రతిపాదనలు
- ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందేలా ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆహార భద్రతా నిబంధనలను రాష్ట్రవ్యాప్తంగా కఠినంగా అమలు చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
ఔషధ నియంత్రణ శాఖ, ఆహార భద్రతా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంజయ్ జాజు పేర్కొన్నారు.

మిగతా 7లో

# కవితకు ఈసీ షాక్..!

- పార్టీ పేరుపై అభ్యంతరాలు
- కొత్త పేర్లు కోరిన ఈసీ



**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):** సొంత రాజకీయ పార్టీతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త ప్రస్థానం ప్రారంభించాలనుకుంటున్న కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక షాక్ ఇచ్చింది. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో పార్టీ నమోదు కోసం దాఖలు చేసిన దరఖాస్తుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించిన ఎన్నికల సంఘం, అదే పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. పార్టీ నమోదు ముందుకు సాగాలంటే 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం కవితకు పంపిన అధికారిక లేఖలో నిర్ణీత గడువులోగా కొత్త పేర్లను సూచించాలని పేర్కొంది. లేదంటే ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది.

మిగతా 7లో

# ట్రిపుల్ ఐటీలో విద్యార్థి మృతి

- క్యాంపస్‌లో విషాద ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు
- మృతుడి వివరాల సేకరణ

7లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చా



(మొదటి పేజీ తరువాయి)

ఉన్నప్పుడు ప్రజల గొంతుకగా సమస్యల పరిష్కారం కోసం పోరాడానని, అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధికి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన రాజకీయ లక్ష్యమని పేర్కొన్నారు.

మిడ్జిల్ ప్రజలు తన రాజకీయ జీవితానికి బలమైన పునాది వేశారని గుర్తు చేసుకున్నారు. 2006లో జెడ్పీటీసీగా గెలిపించి తనపై ఉంచిన విశ్వాసమే ఈరోజు ముఖ్యమంత్రి పదవికి చేర్చిందన్నారు. ఆ రుణం తీర్చుకునేందుకు మిడ్జిల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. గతంలో మిడ్జిల్ తీవ్ర కరవు, వెనుకబాటుతనంతో డార్క్ ఏరియాగా గుర్తింపు పొందిందని గుర్తుచేసిన సీఎం, ఇకపై అది వెలుగులతో నిండిన అభివృద్ధి మండలంగా ప్రభుత్వ రికార్డుల్లో నిలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

తమ ప్రభుత్వం 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యను పరిష్కరించిందని, శతాబ్దకాలంగా జరగని వెనుకబడిన తరగతుల కులగణన నిర్వహించి వారి హక్కులకు మార్గం సుగమం చేసిందని సీఎం తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతోనే ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోగలిగామని చెప్పారు. తాను గ్రామీణ జీవితంలో పెరిగిన వ్యక్తినని, రైతు కష్టాలు, పేదల సమస్యలు ప్రత్యక్షంగా చూసి ఎదిగానని సీఎం పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని, ప్రతి గ్రామ సమస్య పరిష్కారమైతేనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మిడ్జిల్ మండలానికి ఏమిచ్చినా తక్కువేనని, వలసల పాలమూరును అభివృద్ధి పథంలో నడిపించడం తన బాధ్యత అని స్పష్టం చేశారు.

## జెడ్పీటీసీ నుంచి సీఎంగా... ఉరుకొండపేటలో భావోద్వేగ క్షణాలు

- రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- 20 ఏళ్ల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న సీఎం
- ఆత్మీయులతో ప్రత్యేక సమావేశం





నాగర్‌కర్నూల్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు): ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా ఉరుకొండపేటలోని శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాకతో ఉరుకొండపేట గ్రామంలో సందడి నెలకొంది. రాజకీయ జీవితంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉరుకొండపేటలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రికి గ్రామస్థులు, ఆనాటి సహచరులు, పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి తనతో కలిసి పనిచేసిన పాత సహచరులను ఆప్యాయంగా పలకరించారు. ఒక్కొక్కరితో కరచాలనం చేస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సహచరులు 20 ఏళ్ల క్రితం తీసుకున్న ఫొటోలను చూపిస్తూ అప్పటి సంఘటనలను ముఖ్యమంత్రికి గుర్తు చేశారు. గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహచరుల సహకారంతోనే తన రాజకీయ ప్రయాణం ఈ స్థాయికి చేరుకుందని అన్నారు.

ఆలయ అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో రెండు దశాబ్దాలు



- రేవంత్ రాజకీయ ప్రస్థానానికి 20 ఏళ్లు
- జెడ్పీటీసీగా ప్రారంభమైన ప్రయాణం
- ముఖ్యమంత్రికి మంత్రుల శుభాకాంక్షలు
- ప్రజాసేవకు అంకితమంటూ అభినందనలు



**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా తన రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాల మైలురాయిని చేరుకున్నారు. మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైన ఆయన ప్రజాసేవా ప్రస్థానం నేటికి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన ఈ ప్రయాణం రాష్ట్ర అత్యున్నత ప్రజాప్రతినిధి పదవైన ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో 20 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో కొద్దిసేపు వారు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.

రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం మిడ్జిల్ మండలం జెడ్పీటీసీగా ప్రారంభమైంది. అనంతరం శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు. రాష్ట్ర రాజకీయాల్లో కీలక నాయకుడిగా ఎదిగి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడమే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు సంక్షేమం, మహిళల అభ్యున్నతి, యువతకు ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి రంగాల్లో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. తెలంగాణ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడిగా రేవంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని వారు అభినందించారు.

రాజకీయ జీవితంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి పదవి వరకు ఎదిగిన ఆయన ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ పలువురు అభినందన సందేశాలు విడుదల చేశారు. గ్రామీణ స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రాజకీయ ప్రస్థానం రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి చేరుకోవడం ఎంతో మంది యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా మరింత అంకితభావంతో పనిచేయాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. ప్రజాసేవలో మరో ఎన్నో మైలురాళ్లు అధిగమించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## రోశయ్యకు ఘన నివాళులు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత, ప్రజాసేవకు రోశయ్య ప్రతీకగా నిలిచారని అన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలో శాసనసభ్యుడు, శాసన మండలి సభ్యుడు, ఆర్థిక శాఖ మంత్రి, ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల గౌరవాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. ఆర్థిక వ్యవహారాలపై రోశయ్యకు ఉన్న విశేష పట్టు, ప్రజాధనాన్ని అత్యంత బాధ్యతాయుతంగా వినియోగించాలనే ఆలోచన ఆయనను దేశంలోనే విశిష్ట నాయకుడిగా నిలబెట్టిందని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకుల గౌరవాన్ని పొందిన అరుదైన నాయకుడిగా రోశయ్య గుర్తింపు పొందారని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా రాష్ట్ర పరిపాలనను సమర్థంగా నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడారని గుర్తుచేశారు. నేటి రాజకీయ నాయకులు, యువత రోశయ్య నిరాడంబర జీవనశైలి, విలువలతో కూడిన రాజకీయాలు, ప్రజాసేవ పట్ల అంకితభావాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు. ఆర్థిక క్రమశిక్షణే రాష్ట్రాభివృద్ధికి పునాది అని, రోశయ్య జీవితం అందుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు.

రోశయ్యతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని కూడా పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తన రాజకీయ గురువు చొక్కారావుతో కలిసి రోశయ్యను అనేకసార్లు కలిసే అవకాశం లభించిందని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే వినోద్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ఐఏఎస్ అధికారి వాణి ప్రసాద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. రోశయ్య ప్రజాసేవ, విలువల రాజకీయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని వక్తలు పేర్కొన్నారు.

## మరమ్మతులు పూర్తయ్యాకే కాళేశ్వరం బ్యారేజీల నిర్వహణ: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు అన్ని గేట్లను తెరిచి బ్యారేజీలను లోడ్ లేకుండా నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

బ్యారేజీల పునరుద్ధరణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. భూగర్భ పరిశోధనలు, విధ్వంసం లేకుండా పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు, డ్రోన్ సర్వేలు, వందకు పైగా బోర్‌హోల్స్ ద్వారా నిర్మాణాల స్థితిని పరిశీలిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర జలశక్తి పరిశోధన సంస్థ, కేంద్ర జల సంఘం సంయుక్తంగా పునరుద్ధరణ ప్రణాళికలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్వహణ, భద్రతపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. కాలువల నిర్వహణ, పెండింగ్ నీటిపారుదల పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడలో ఆధునిక బియ్యం మిల్లును ప్రారంభించిన మంత్రి, గుల్లపోతులగండి, కేశవాపూర్, నెల్లికల్లు ఎత్తిపోతల పథకాల పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన పలు నీటిపారుదల పథకాలను ప్రస్తుత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అమలు చేస్తోందని తెలిపారు.



## అల్లూరి ఆశయాలే నిజమైన నివాళి

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులు**
**ట్యాంక్‌బండ్‌లో జయంతి వేడుకలు**

హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు): సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేవలం 27 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి విశేష స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.

"ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల కోసమే" అనే భావజాలంతో అల్లూరి తన జీవితాన్ని అంకితం చేశారని భట్టి పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. అల్లూరి కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, స్వేచ్ఛను ప్రేమించే ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే మహోన్నత శక్తి అని అభివర్ణించారు. నేటి సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేయడం ద్వారా అల్లూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. జయంతి కార్యక్రమంలో భాగంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సమకూర్చిన అంబులెన్స్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులకు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల విధి నిర్వహణకు, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించడంలో ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్షత్రియ సేవా సమితి ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు ఆశయాలను భావితరాలకు చాటి చెప్పేలా ప్రతి సంవత్సరం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)



అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమై దేశానికే ఆదర్శంగా నిలిచిందని, అదే స్ఫూర్తితో పట్టణ ప్రాంతాల్లో కూడా అందుబాటు ధరల్లో గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో పేదల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలు సమన్వయంతో పనిచేసి ఇప్పటికే గుర్తించిన స్థలాల్లో వెంటనే పనులు ప్రారంభించేలా కార్యాచరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంకా స్థలాలు ఖరారు కాని నియోజకవర్గాల్లో తక్షణమే భూములను గుర్తించాలని సూచించారు. పట్టణ అభివృద్ధి పరిధిలోని 26 నియోజకవర్గాల్లో తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 500 ఇళ్ల చొప్పున నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన గృహాలను సకాలంలో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 10 ఆర్డీవో కార్యాలయాలు, 107 తహసీల్దార్ కార్యాలయాలు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన రెండు డీఐజీ కార్యాలయాలు, నాలుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, 52 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. అన్ని భవనాలను ఒకే నమూనాలో ఆధునిక సౌకర్యాలతో, ప్రజలకు అనుకూలంగా నిర్మిస్తామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సోలార్ పార్కింగ్ సదుపాయాలను కూడా కల్పిస్తామని మంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# IIITలో సీటు సాధించిన వెన్నలకు స్ఫూర్తి ఫౌండేషన్ అండ



- **ఎస్ఎస్‌సీలో 571 మార్కులతో మండల ర్యాంక్.**
- **ఉన్నత విద్యకు రూ.15,200 ఆర్థిక సహాయం.**

**కల్లూరు, జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతిభకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో స్ఫూర్తి ఫౌండేషన్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. కల్లూరు మండలం చంద్రుపట్ల జెడ్పీ హెచ్ఎస్‌లో చదివి ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 571 మార్కులతో మండల ర్యాంక్ సాధించి, బాసర IIITలో ప్రవేశం పొందిన ప్రతిభావంతురాలు రామిశెట్టి సాయి వెన్నలకు రూ.15,200 ఆర్థిక సహాయాన్ని అందజేసింది. స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో అమెరికాలో నర్సింగ్ రంగంలో ఉన్న ఓ దాత అందించిన ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి కాటంనేని విజయలక్ష్మి, ఉపసర్పంచి రాధాకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు విద్యార్థినికి చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని సాధించిన విజయం గ్రామానికి గర్వకారణమని, ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డుకాకూడదనే ఉద్దేశంతో స్ఫూర్తి ఫౌండేషన్ విద్యార్థులకు అండగా నిలుస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినికి ఆకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్ద కాటంనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థిని తల్లి, కుటుంబ సభ్యులు స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు ఆర్థిక సహాయం అందించిన అమెరికా దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# స్థానిక ఉపాధిపై వలసల ప్రభావం

- **గ్రామాల్లో మారుతున్న ఆర్థిక పరిస్థితులు – స్థానికులకు సవాళ్లు, పోటీతో కొత్త మార్పులు**

**భీమదేవరపల్లి, జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు, వలస కార్మికుల సంఖ్య పెరుగుతోంది. గుజరాత్, రాజస్థాన్, బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు వ్యాపారాలు, కూలీ పనుల్లో స్థిరపడుతుండటంతో స్థానిక ఉపాధి, చిన్న వ్యాపారాలపై ప్రభావం పడుతోందని కొందరు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఒకప్పుడు స్థానికుల ఆధీనంలో ఉన్న చిన్న వ్యాపారాలు ప్రస్తుతం పెరిగిన పోటీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు చెబుతున్నారు. ముఖ్యంగా గుజరాతీలు, మార్వాడీలు, రాజస్థానీలకు చెందిన వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలను విస్తరించడంతో స్థానిక చిన్న దుకాణదారులు పోటీని ఎదుర్కొంటున్నారని అభిప్రాయపడుతున్నారు. అలాగే నిర్మాణ రంగం, వ్యవసాయ పనులు తదితర రంగాల్లో బీహార్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు తక్కువ వేతనాలకు పనిచేయడం వల్ల స్థానిక కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని, కూలీ రేట్లు కూడా పడిపోతున్నాయని కొందరు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మరోవైపు, కొందరు వ్యాపారవేత్తలు, ఆర్థిక నిపుణులు మాత్రం పోటీ వల్ల వినియోగదారులకు మెరుగైన సేవలు, తక్కువ ధరలకు వస్తువులు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. అలాగే అవసరమైన చోట వలస కార్మికులు శ్రామిక లోటును భర్తీ చేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, చిన్న వ్యాపారులకు ప్రోత్సాహం, కార్మిక సంక్షేమ విధానాల సమర్థ అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.
గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అభిప్రాయాలు గ్రామస్థులు మరియు సంబంధిత వర్గాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలుగా మాత్రమే పేర్కొనబడ్డాయి. వలసలు, ఉపాధిపై ప్రభావం ప్రాంతానికొకలా మారవచ్చు.

# కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ.. అంగన్వాడీ కేంద్రంపై గ్రామస్తుల ఆగ్రహం



**వేలేరు, జులై 04 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని ఓ అంగన్వాడీ కేంద్రంలో లబ్ధిదారురాలికి పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయినవిగా ఉండటంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమైంది. ఇంటికి తీసుకెళ్లి గుడ్లను పగులగొట్టగా అవి పూర్తిగా పాడై ఉండటాన్ని గమనించిన మహిళ అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహార నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్ల నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# హైవే దిగి తప్పించుకోవాలనుకున్నారు... సత్తుపల్లిలో చిక్కారు..!





- **ఒడిశా నుంచి హైదరాబాద్‌కు భారీ గంజాయి రవాణా భగ్నం.**
- **రూ.89.13 లక్షల విలువైన 166.360 కిలోల గంజాయి స్వాధీనం.**
- **డ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాల గాలింపు.**

**సత్తుపల్లి, జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను సత్తుపల్లి పోలీసులు చాకచక్యంగా భగ్నం చేశారు. ముందస్తు సమాచారం ఆధారంగా చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.89.13 లక్షల విలువైన 166 కిలోల 360 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిని అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరికి ఒడిశా నుంచి గంజాయి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో, కల్లూరు ఏసీపీ వసుంధరా యాదవ్ పర్యవేక్షణలో ఈగిల్ బృందం, పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న టయోటా ఎటియోస్ కారును తనిఖీ చేయగా, డిక్కీలోని ఆరు ప్లాస్టిక్ సంచుల్లో బ్రౌన్ టేప్‌తో చుట్టిన 80 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటి మొత్తం బరువు 166 కిలోల 360 గ్రాములు కాగా, మార్కెట్ విలువ సుమారు రూ.89.13 లక్షలుగా పోలీసులు అంచనా వేశారు. కారుతో పాటు ఒక సెల్‌ఫోన్, రూ.500 నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.
హైవే వదిలినా పోలీసుల నుంచి తప్పించుకోలేక దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, ఒడిశాకు చెందిన ప్రబిన్ భాత్రా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన బికారి అలియాస్ రోహన్ రూ.10 వేల పారితోషికం ఆశ చూపించి, 80 గంజాయి ప్యాకెట్లను హైదరాబాద్‌లో అప్పగించాలని సూచించాడు. ఈ మేరకు AP39AT8240 నంబర్ గల టయోటా ఎటియోస్ కారులో గంజాయిని లోడ్ చేసి పంపించారు. జూలై 3 తెల్లవారుజామున దారకొండ జంక్షన్ నుంచి బయలుదేరిన నిందితులు రాజమండ్రి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ప్రయాణించారు. ముందున్న పోలీసు తనిఖీల సమాచారం తెలుసుకుని వెంసూరు వద్ద హైవే దిగి సత్తుపల్లికి చేరుకున్నారు. అక్కడ భోజనం చేసి, సత్తుపల్లి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లాలని భావించారు. అయితే అప్పటికే అప్రమత్తమైన పోలీసులు సమాచారం మేరకు సత్తుపల్లి సమీపంలో వాహనాన్ని అడ్డగించి నిందితుడిని పట్టుకుని భారీ గంజాయి రవాణాను భగ్నం చేశారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని 8(c), 20(b)(ii)(C), 27(A), 29 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు ప్రబిన్ భాత్రాను రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న బికారి అలియాస్ రోహన్, చుక్క నాగేశ్వరరావు గౌడ్‌ల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. సమాచారం ఇస్తే రివార్డు గంజాయి కొనుగోలు, విక్రయం, రవాణా లేదా వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. గంజాయికి సంబంధించిన సమాచారం అందించే వారి పేర్లను పూర్తిగా గోప్యంగా ఉంచి తగిన నగదు బహుమతి అందజేస్తామని వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో ఎస్ఐ వీరప్రసాద్, ఎస్ఐ ప్రదీప్, ఈగిల్ బృందం సభ్యులు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యసనాలకు 'నో' చెప్పండి.. బాధ్యతాయుత పౌరులుగా ఎదగండి

- **యువతకు ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ సందేశం.**



**జమ్మికుంట టౌన్ జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని హుజురాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం జమ్మికుంట మండలంలోని విలసాగర్ గ్రామంలో యువతకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. అలాగే ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా, చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి, గ్రామ భద్రత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యువతతో కలిసి వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజ హితం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్లో ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు



**జమ్మికుంట టౌన్ జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కర్ణాటక మరియు తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 16 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అరుదైన నాయకుడిగా రోశయ్య దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. మృదుస్వభావి, నిజాయితీ గల ప్రజానాయకుడైన రోశయ్య జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. యువత రోశయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో బీఆర్ఏఓయూ డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**జమ్మికుంట టౌన్ జూలై 04 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) స్టడీ సెంటర్ ద్వారా 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ దూరవిద్య ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.ఓ. కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ కే. రాజేంద్రం తెలిపారు.
బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరాలనుకునే అర్హులైన విద్యార్థులు ఆగస్టు 7, 2026లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులతో పాటు ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరాలు అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా నిర్ణీత గడువులోగా తమ వార్షిక ట్యూషన్ ఫీజును చెల్లించాలని తెలిపారు.
గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగం లేదా ఇతర బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేందుకు దూరవిద్య చక్కటి అవకాశమని పేర్కొన్నారు. ప్రవేశాలు, ఫీజులు మరియు ఇతర వివరాల కోసం 73829 29775 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ ఉన్నత విద్య లక్ష్యాలను సాధించాలని వారు కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# అర్హులందరికీ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలి



- దయ్యాల దాసు

**వనపర్తి,జూలై04( తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చరణ్ దాసు ను జూబ్లీహిల్స్ డివిజన్ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షులు,ఐ ఎన్ టి యు సి తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా దయ్యాల దాసు మాట్లాడుతూ..ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈడీని కోరారు.దీనిపై స్పందించిన ఈడీ చరణ్ దాసు మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులందరికీ ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అడ్డాకుల బెంజిమెన్, గద్దల ప్రభాకర్, కండెరా రాంకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



- శ్రీ చైతన్య ఈ-టెక్నో స్కూల్‌లో ఘనంగా వనమహోత్సవం

**హుజూరాబాద్,జులై 04(తెలంగాణ ముచ్చట్లు ):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లోని శ్రీ చైతన్య ఈటెక్నో స్కూల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ సందీప్ అధ్యక్షత వహించగా, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడిన ఆమె, చెట్లు ప్రకృతికి ప్రాణాధారమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సందమల్ల పుణ్యబాబు, బండ నరేష్, సొల్లు సునీత, బోగారాల మొగిలయ్య, ఇల్లందుల సమ్మయ్య పాల్గొని మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతి ఇంటా, ప్రతి విద్యాసంస్థలో విస్తృతంగా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల నీడనిచ్చే, ఫలవృక్షాల మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా విప్లవ గాయకుడు కామ్రేడ్ అరుణోదయ...



- నాగన్నకు ఇవే మా జోహార్లు
- ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం

**ఖమ్మం బ్యూరో, జులై 4(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా కె వి కృష్ణారావు లెనిన్ నగర్ అరుణోదయ... నాగన్న పార్థిక దేహాన్నికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు .ప్రజా సాంస్కృతిక ఉద్యమం పట్ల ఆయనకున్న నిబద్ధత చాలా గొప్పదని ఆయన మరణం బహుజనులకు తీరని లోటని పేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్న మహనీయుడని ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం ఆయన ఆటపాటలతో సమాజాన్ని మేల్కొల్పి పేదవాడి గుండెలో వెలుగై నిలిచారని అన్నారు . ఈ కార్యక్రమంలో పగడాల నరేందర్ , బొబ్బిలి భరత్ చంద్ర , బానోతు భద్రు నాయక్ , అనిల్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు .

# ఏఎస్ఐ శివపార్వతి సేవలు అభినందనీయం

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,జూలై 04 (తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా పోలీసు శాఖలో 38 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించి ఏఎస్ఐగా పదవీ విరమణ చేసిన శ్రీమతి శివపార్వతి సేవలు అభినందనీయమని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఎస్ సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శివపార్వతిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైందని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. సాధారణ హోం గార్డుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన శివపార్వతి, క్రమంగా పదోన్నతులు పొంది ఏఎస్ఐ స్థాయికి చేరుకోవడం ఆమె కృషి, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు.38 సంవత్సరాలపాటు నిబద్ధతతో విధులు నిర్వహించి అందరి అభిమానాన్ని సంపాదించారని తెలిపారు. ముఖ్యంగా షీ టీమ్‌లో ఆమె చేసిన సేవలు మహిళల భద్రతకు ఎంతో తోడ్పడటమే కాకుండా, విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచాయని శంకర్ గౌడ్ అన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్డీఎస్ సేవా సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్, కందూరు నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, రామ్‌రెడ్డి, కవిత, శ్రీలక్ష్మి, ఎడ్విన్, గంధం రాజు, జ్యోతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- శ్రీ చైతన్య ఈ-టెక్నో స్కూల్‌లో ఘనంగా వనమహోత్సవం



**హుజూరాబాద్,జులై 04(తెలంగాణ ముచ్చట్లు ):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని పలువురు ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. హుజూరాబాద్‌లోని శ్రీ చైతన్య ఈటెక్నో స్కూల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ సందీప్ అధ్యక్షత వహించగా, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడిన ఆమె, చెట్లు ప్రకృతికి ప్రాణాధారమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సందమల్ల పుణ్యబాబు, బండ నరేష్, సొల్లు సునీత, బోగారాల మొగిలయ్య, ఇల్లందుల సమ్మయ్య పాల్గొని మొక్కలు నాటారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతి ఇంటా, ప్రతి విద్యాసంస్థలో విస్తృతంగా మొక్కలు నాటాలని, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల నీడనిచ్చే, ఫలవృక్షాల మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొని వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# మల్లారం సబ్‌స్టేషన్ పరిధిలో నూతన 'నర్సంపల్లి ఫీడర్' ఏర్పాటు

- లోడ్ తగ్గించి నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు



**భీమదేవరపల్లి, జూలై 4 (తెలంగాణ ముచ్చట్లు):**విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపర్చే లక్ష్యంతో మల్లారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన 'నర్సంపల్లి ఫీడర్' ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి.

మైసమ్మపల్లి, మల్లారం ఫీడర్లపై ఉన్న అధిక లోడ్‌ను తగ్గించేందుకు వాటిని విభజిస్తూ నర్సంపల్లి పేరుతో కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేసి సబ్‌స్టేషన్‌లో పనులను వేగంగా చేపట్టారు. కొత్తకొండ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ, నూతన ఫీడర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత మైసమ్మపల్లి, మల్లారం ఆర్ ఫీడర్లపై లోడ్ గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. దీంతో మైసమ్మపల్లి, మల్లారం తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గి రైతులు, గృహ వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుతుందని వివరించారు.

ఈ పనుల్లో ఏఎల్ఎం సుధాకర్, లైన్‌మ్యాన్ రాజిరెడ్డి, ఆపరేటర్ వీరస్వామి, కాంట్రాక్టర్ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా వంగవీటి జయంతి వేడుకులు

- పట్టణంలో భారీ బైకు ర్యాలీ చేపట్టిన యువత



**ఖమ్మం బ్యూరో, జూలై 4(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా కేంద్రంలో వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలను మున్నూరు కాపు సంఘం యూత్ ఘనంగా నిర్వహించారు..మున్నూరుకాపు సంఘం యూత్ అధ్యక్షుడు తోట రమేష్ కుమార్ పిలుపు మేరకు యూత్ భారీగా ఎంబి గార్డెన్ వద్దకు చేరుకున్నారు.. మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు జెండా ఊపి బైకు ర్యాలీని ప్రారంభించారు..వంగవీటి మోహన రంగా చిత్రపటాలు జెండాలతో యువత బైకులపై కాల్వోడ్డు మీదుగా గాంధీచౌక్, గ్రెయిన్ మార్కెట్ రోడ్, బోస్ బొమ్మ ప్రాంతం మీదుగా శ్రీనివాస నగర్, చర్చికౌంపౌండ్ నుండి జెడ్పి సెంటర్ మీదుగా ఇల్లందు క్రాస్ రోడ్ గట్టయ్య సెంటర్ నుండి బైపాస్ రోడ్డు మీదుగా ఏంబి గార్డెన్ వరకు భారీ బైకు ర్యాలీ నిరహించారు..అనంతరం ఏంబి గార్డెన్ లో వంగవీటి మోహన రంగా చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి అభిమానుల సందోహం మధ్య కేకే కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం, రాష్ట్ర జిల్లా నేతలు మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మీ విజయవాడ కేంద్రంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశాడని వారు కొనియాడారు.. అట్టడుగున్న వర్గాల కోసం గూడు నిర్మించేందుకు ఆమరణ నిరాహార దీక్ష చేపడితే ఆనాటి పాలకులు ఆయనను అంతం చేశారు.. కానీ ఆయన ఆశయ సాధన మాత్రం అంతం చేయలేక పోయారు.. వంగవీటి మోహన రంగా చూపిన బాటనే నేటికీ వారి ఆశయ సాధన కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో యువత పెద్ద ఎత్తున జయంతి వర్ధంతి వేడుకలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై నిత్యం గలమెత్తుతూనే ఉన్నామని వారు తెలిపారు.. వంగవీటి మోహన రంగా ఆశయ సాధన కోసం మున్నూరు కాపు కులస్తులు ఎల్లప్పుడూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని నేతలు స్పష్టం చేశారు.. బైక్ ర్యాలీ అన్నదాన కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పోదిల రవికుమార్ కొత్త సీతారాములు, ఆకుల గాంధీ, శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, ఆర్ జె సి కృష్ణ,పసుపులేటి దేవేందర్,మదూరి పూర్ణ, పగడాల కిషోర్, సోదా నరసింహారావు, హారిక నాయుడు, ఖమ్మం జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్ కుమార్ ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్, సుంకర చిరంజీవి,పాల్వంచ రాజేష్, రాపర్తి రాజా, దినేష్ నాయుడు,నానాభాల హరీష్, ఆకుల వినయ్, గణేష్ నాయుడు, గుణా, శాసనాలా సాయి రాం, అన్వేష్ నాయుడు, పారా ఉదయ్ కిరణ్ నాయకులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పసిడి ధరలకు మళ్లీ రెక్కలు..

**హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల వరుసగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మరోసారి పెరుగుదల బాట పట్టాయి. గత రెండు రోజులుగా పసిడి ధరలు క్రమంగా పెరుగుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం ఉదయం నమోదైన ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,010కు చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,34,760గా నమోదైంది. ఇదే సమయంలో వెండి ధర కూడా స్వల్పంగా పెరిగింది. కిలో వెండిపై రూ.100 పెరగడంతో హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,60,100గా కొనసాగుతోంది. తెలంగాణలోని హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ .1,47,010గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,34,760గా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,10,260గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో మాత్రం స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,570గా ఉండి దేశంలోనే అత్యధికంగా నమోదైంది. అక్కడ 22 క్యారెట్ల బంగారం రూ.1,37,010, 18 క్యారెట్ల బంగారం రూ.1,14,410గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,160, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,910, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,410గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో హైదరాబాద్‌తో సమానంగానే ధరలు కొనసాగుతున్నాయి. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,060, 22 క్యారెట్ల బంగారం రూ.1,34,810, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,310గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విదేశీ మారకపు విలువల్లో మార్పులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల కొనుగోళ్ల ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో ప్రతిరోజూ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పండుగలు, శుభకార్యాల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు కొనుగోలు చేసే ముందు స్థానిక ఆభరణాల దుకాణాల్లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# సోనీ లివ్‌తో సమంత కొత్త ప్రయాణం



